తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శనివారం - 27- జూన్ 2026 | సంపుటి : 4 | సంచిక : 23 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# రేపే పల్స్ పోలియో కార్యక్రమం


## ఒక్క చిన్నారి కూడా మిగలొద్దని మంత్రి దామోదర్ ఆదేశం
## రాష్ట్రవ్యాప్తంగా 22,979 పోలియో బూత్‌ల ఏర్పాటు
## తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని పిలుపు

**హైదరాబాద్, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రవ్యాప్తంగా రేపటి నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

జూబ్లీహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జూన్ 28న పోలియో బూత్‌ల ద్వారా, జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పట్టణ ప్రాంతాలు అధికంగా ఉండటంతో జూలై 1న అదనంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 22,979 పోలియో బూత్‌లు, 903 మొబైల్ బృందాలు, 903 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సుమారు 40.97 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 52.04 లక్షల బీవోపీవీ టీకా డోసులు జిల్లాలకు సరఫరా చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు.

మిగతా 2లో





# ఆపరేషన్ సింధూర్‌కు ఆరుగురు వీరుల త్యాగం

- వీరమరణం పొందిన జవాన్ల పేర్లు అధికారికంగా విడుదల
- జాతీయ యుద్ధ స్మారకంపై చిరస్థాయిగా నిలిచే గౌరవం
- దేశ రక్షణ కోసం చేసిన త్యాగానికి భారతం వందనం

**న్యూఢిల్లీ, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సాయుధ దళాలు చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సందర్భంగా ఆరుగురు భారతీయ సైనికులు వీరమరణం పొందినట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ ఆపరేషన్‌లో దేశం కోసం ప్రాణాలు అర్పించిన జవాన్ల పేర్లను తొలిసారిగా ప్రకటించడంతో పాటు, వారి త్యాగాన్ని శాశ్వతంగా గుర్తుంచుకునేలా జాతీయ యుద్ధ స్మారకంపై చెక్కనున్నట్లు భారత సైన్యం తెలిపింది.

మిగతా 2లో



# డ్రగ్స్‌పై సమాజమంతా ఏకమవ్వాలి: భట్టి విక్రమార్క

- మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో సినీ ప్రముఖుల సందేశం
- శిల్పకళావేదికలో ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం
- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపు



**హైదరాబాద్, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ఈగల్ ఫోర్స్, వికలాంగులు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రభుత్వంతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మిగతా 2లో

# అసైన్డ్ భూముల విషయంలో పేదలకు అండగా ఉంటాం: కేటీఆర్

- పరిగి బీఆర్ఎస్ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు
- అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని వెల్లడి
- పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లాలని పిలుపు

పరిగి, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు): పరిగి నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు అదే భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దళితులు, గిరిజనులు, పేద రైతుల భూములను పారిశ్రామికవాడల పేరుతో తీసుకుంటున్నారని విమర్శించారు. పరిగి నియోజకవర్గంలో కూడా పారిశ్రామికవాడల పేరిట పేదల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల అంగీకారం లేకుండా భూములు తీసుకోవడం సరికాదని, ప్రభుత్వం నిజంగా చిత్తశుద్ధితో వ్యవహరిస్తే ముందుగా పట్టాలు ఇచ్చి,

మిగతా 2లో



# వివాహేతర సంబంధం.. భర్త హత్య



- అనారోగ్య మరణంగా చిత్రీకరించే యత్నం
- శవంపై గాయాలతో బయటపడిన అసలు విషయం
- అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**నాగర్‌కర్నూల్, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

నాగర్‌కర్నూల్ జిల్లాలో వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్త హత్యకు గురైన ఘటన సంచలనం సృష్టించింది. తొలుత అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులను నమ్మించే ప్రయత్నం జరిగినప్పటికీ, శవంపై అనుమానాస్పద గాయాలను గుర్తించిన బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం,

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రేపే పల్స్ పోలియో కార్యక్రమం

(మొదటి పేజీ తరువాయి)



వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ బస్తీలు, కొత్త కాలనీలు, గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులకు ప్రత్యేకంగా పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆర్టీసీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. తెలంగాణలో చివరి పోలియో కేసు 2007లో నమోదైందని అధికారులు గుర్తు చేశారు. పోలియో రహిత హోదాను కొనసాగించేందుకు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయడం అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. గతంలో పోలియో చుక్కలు వేసినా మరోసారి వేయించడం వల్ల పూర్తి రక్షణ లభిస్తుందని వివరించారు. తల్లిదండ్రులందరూ జూన్ 28న తమ 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులను సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి రెండు చుక్కల పోలియో టీకా తప్పనిసరిగా వేయించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు. ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా అందరూ సహకరించి తెలంగాణను, దేశాన్ని పోలియో రహితంగా కొనసాగించాలని పిలుపునిచ్చారు.



# డ్రగ్స్‌పై సమాజమంతా ఏకమవ్వాలి: భట్టి విక్రమార్క

(మొదటి పేజీ తరువాయి)

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ వ్యసనం వ్యక్తి, కుటుంబం, సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని హెచ్చరించారు.

కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్, సందీప్ కుమార్ శాండిల్య, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అనితా రామచంద్రన్ పాల్గొని మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సినీ నటుడు రామ్ పోతినేని, సినీ నటి మీనాక్షి చౌదరి కూడా కార్యక్రమంలో పాల్గొని యువతకు సందేశం ఇచ్చారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, సమాజ అభివృద్ధికి ప్రతి యువకుడు తనవంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.






కార్యక్రమంలో డ్రగ్స్ దుష్పరిణామాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు, యువత, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ నిర్మూలనకు తమ మద్దతు ప్రకటించారు. డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని విభాగాల సమన్వయంతో పనిచేస్తోందని అధికారులు తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేసి సమాజ రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.




# ఆపరేషన్ సింధూర్‌కు ఆరుగురు వీరుల త్యాగం

(మొదటి పేజీ తరువాయి)

వీరమరణం పొందిన వారిలో సుబేదార్ మేజర్ పవన్ కుమార్, రైఫిల్‌మాన్ సునిల్ కుమార్, లాన్స్ నాయక్ దినేశ్ కుమార్, అగ్నివీర్ మురళీ నాయక్, హవిల్దార్ సునిల్ కుమార్ సింగ్‌తో పాటు భారత వైమానిక దళానికి చెందిన సురేంద్ర కుమార్ ఉన్నారు. దేశ భద్రత కోసం నిర్వహించిన సైనిక చర్యల్లో వీరు అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శిస్తూ అమరులయ్యారని అధికారులు పేర్కొన్నారు.

ఆపరేషన్ సింధూర్‌లో ప్రాణత్యాగం చేసిన ఈ ఆరుగురు జవాన్లతో పాటు 2025లో వివిధ సైనిక కార్యకలాపాల్లో అమరులైన మరికొందరు సైనికుల పేర్లను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. నేషనల్ వార్ మెమోరియల్‌లోని త్యాగ చక్ర వద్ద వీరి పేర్లను శాశ్వతంగా పొందుపరచడం ద్వారా దేశం వారి సేవలను చిరస్మరణీయంగా నిలుపుకోనుంది. గత ఏడాది మే 7న పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సాయుధ దళాలు లక్షిత దాడులు నిర్వహించాయి. పహల్గామ్ ఉగ్రదాడికి బాధ్యులైన ఉగ్రవాద మౌలిక వసతులను ధ్వంసం చేయడమే ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యంగా చేపట్టబడింది. ఈ చర్యతో ఉగ్రవాదంపై భారత వైఖరి మరోసారి స్పష్టమైంది. భారత దాడులకు ప్రతిస్పందనగా పాకిస్థాన్ డ్రోన్ దాడులు, సరిహద్దు కాల్పులు, వైమానిక దాడులకు పాల్పడటంతో రెండు దేశాల మధ్య నాలుగు రోజుల పాటు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భారత సాయుధ దళాలు సమర్థంగా ప్రతిఘటించి శత్రు ప్రయత్నాలను విఫలం చేశాయి. అనంతరం మే 10న ఇరు దేశాల మధ్య యుద్ధ విరమణ అమల్లోకి రావడంతో పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్నాయి. ఆపరేషన్ సింధూర్‌లో అమరులైన వీర జవాన్ల త్యాగం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రాణాలను అర్పించిన ఈ సైనికుల సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, వారి కుటుంబాలకు దేశం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేసింది.

# వివాహేతర సంబంధం.. భర్త హత్య

(మొదటి పేజీ తరువాయి)



మృతుడి భార్యకు తన అల్లుడితో వివాహేతర సంబంధం ఉన్నట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో హత్యకు పాల్పడినట్లు ఆమె ప్రాథమిక విచారణలో అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే ఈ అంశంపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

ఘటన అనంతరం మృతుడు అనారోగ్యంతో మరణించినట్లు బంధువులను నమ్మించే ప్రయత్నం జరిగినట్లు పోలీసులు తెలిపారు. అయితే మృతదేహంపై గాయాలున్నట్లు గమనించిన కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేసి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించి విచారణ ప్రారంభించారు. విచారణలో భార్య పాత్రపై అనుమానాలు బలపడగా, ఘటనలో కూతురు, అల్లుడి ప్రమేయం కూడా ఉండొచ్చనే అనుమానంతో వారిపైనా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాలు, ఇతర సాక్ష్యాలను సేకరిస్తూ దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదికతో పాటు ఫోరెన్సిక్ ఆధారాల ఆధారంగా కేసులో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. అవసరమైతే మరికొందరిని కూడా విచారించే అవకాశం ఉందని తెలిపారు. ఈ ఘటన జిల్లాలో తీవ్ర సంచలనం రేపింది. కేసుకు సంబంధించిన అన్ని కోణాలను పరిశీలిస్తున్నామని, దర్యాప్తు పూర్తయిన అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

# అసైన్డ్ భూముల విషయంలో పేదలకు అండగా ఉంటాం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

చట్టబద్ధమైన నష్టపరిహారం చెల్లించిన తర్వాతే భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

లగచర్ల ఘటనను ప్రస్తావిస్తూ భూములు ఇవ్వలేదనే కారణంతో రైతులపై కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. గిరిజనులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించడం దురదృష్టకరమని, ఇలాంటి చర్యలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. అసైన్డ్ భూముల విషయంలో పేదలకు పార్టీ అండగా నిలుస్తుందని, అవసరమైతే న్యాయపోరాటం కూడా చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. రైతులకు రైతుబంధు, పంట బోనస్, కౌలు రైతులు, రైతు కూలీలకు ఆర్థిక భరోసా, మహిళలకు నెలకు రూ.2,500 వంటి హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఇచ్చిన హామీలు కూడా అమలు కాలేదని అన్నారు.

పరిగి ప్రాంతానికి నీటి ప్రాజెక్టుల విషయంలో కూడా ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. గతంలో రూపొందించిన ప్రణాళికలను పక్కనపెట్టి కొత్త పథకాల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేకపోతే ప్రజలకు సమాధానం చెప్పాల్సి వస్తుందని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తే పార్టీ అండగా ఉంటుందని, చట్టపరంగా పోరాడుతామని హెచ్చరించారు. అలాగే భవిష్యత్తులో కార్యకర్తలకు తగిన గౌరవం, అవకాశాలు కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.






# "సే నో టు డ్రగ్స్"అవగాహన 2కే ర్యాలీ నిర్వహణ

**భీమదేవరపల్లి, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టే లక్ష్యంతో వరంగల్ కమిషనరేట్, కలెక్టరేట్ ఆధ్వర్యంలో "Say No To Drugs" అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సుమారు రెండు కిలోమీటర్ల మేర 2కే ర్యాలీ నిర్వహించి, యువతకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. "మీ జీవితాన్ని, మీ కుటుంబాన్ని, మీ భవిష్యత్తును కాపాడుకోవాలంటే డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలి" అని పిలుపునిచ్చారు.

అలాగే, క్షణిక మత్తు కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రులు తమ పిల్లలతో ప్రతిరోజూ మాట్లాడి వారి ప్రవర్తనలో మార్పులను గమనించాలని సూచించారు. మాదకద్రవ్యాల చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ముల్కనూరు ఎస్సై రాజు, భీమదేవరపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్, ఉపాధ్యక్షుడు చిట్కూరి అనిల్, మాడుగుల చింటూ, శ్రీకాంత్ ,ములకనూర్ పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు, యువకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# భవిష్యత్ వ్యవసాయానికి ఉద్యాన పంటలే ప్రత్యామ్నాయం

- **డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**

**పెద్దమందడి,జూన్26(తెలంగాణ ముచ్చట్లు):** భవిష్యత్ వ్యవసాయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగును తగ్గించి ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు.పెద్దమందడి మండలం మోజర్లలోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి హార్టికల్చర్ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు.వ్యవసాయం కంటే ముందే ఉద్యానవన సాగు ప్రారంభమైందని, హార్టికల్చర్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని విద్యార్థులకు వివరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హార్టికల్చర్ అభివృద్ధికి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి, తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే పంటలను ప్రోత్సహించే లక్ష్యంతో హార్టికల్చర్ కళాశాలలను స్థాపించారని గుర్తు చేశారు. మోజర్లలో హార్టికల్చర్ కళాశాల ఏర్పాటు కూడా అదే ఆలోచనలో భాగమేనన్నారు. తెలంగాణలో సాగునీటి వనరులను మరింత విస్తరించేందుకు గతంలో చేపట్టిన ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడ్డాయని, ప్రస్తుతం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సీఎం ప్రజావాణి ద్వారా 175 ఉద్యానవన విస్తరణ అధికారి పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కళాశాల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచి ఉత్తమ హార్టికల్చర్ నిపుణులను తీర్చిదిద్దాలని అధ్యాపక బృందాన్ని కోరారు.ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అగ్రికల్చర్ డీన్ చినా, అసోసియేట్ డీన్ వీణ జోషి, అధ్యాపకులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయం నిర్లక్ష్యంపై బీఎస్పీ ఆగ్రహం

- **బాధితురాలు పద్మకు పరామర్శ**



**హుజురాబాద్, జూన్ 26(తెలంగాణ ముచ్చట్లు ):** తహశీల్దార్ కార్యాలయం నిర్లక్ష్యం కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన బాధితురాలు దుకురే పద్మను, ఆమె కుమారుడు రాజ్ కమల్‌ను బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు పరామర్శించారు. హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు మహేందర్ జీ (జూపాక ఉప సర్పంచ్) ఆధ్వర్యంలో జోన్ ఇన్‌చార్జ్ పల్లె ప్రశాంత్ గౌడ్ (MA, LLB), అసెంబ్లీ ఇన్‌చార్జ్ అంబాల ప్రభాకర్, సీనియర్ నాయకులు మారపెల్లి మోగిలయ్య, గిరవేణి శ్రీకాంత్, సందేల వెంకన్న, మామిండ్ల మల్లయ్య, జాజుల శ్రీనివాస్ తదితరులు బాధిత కుటుంబాన్ని కలిసి సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా పల్లె ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజలు తమ భూముల పట్టాలు, కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం ఎమ్మార్వో కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరుగుతున్నారని, పేదల ఫైళ్లు కదలాలంటే లంచం డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ప్రజా సేవ కోసం ఉన్న కార్యాలయాలు అవినీతి కేంద్రాలుగా మారకూడదని, రాజ్యాంగానికి లోబడి ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు.

లంచం అడగడం, ప్రభుత్వ సేవలను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడం చట్ట విరుద్ధమని, ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు చట్టపరంగానూ, ప్రజా పోరాటాల ద్వారానూ అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

బీఎస్పీ ప్రధాన డిమాండ్లు

బాధితురాలు పద్మ వైద్య ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే భరించాలి.

ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై తక్షణ శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. అవినీతి నిరోధక శాఖ (ACB) తో విచారణ చేపట్టాలి. ఎమ్మార్వో కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న పేదల ఫైళ్లను 15 రోజుల్లో పరిష్కరించాలి.

ప్రతి మండల కార్యాలయంలో "లంచం ఇవ్వడంతీసుకోవడం నేరం" అనే అవగాహన బోర్డుతో పాటు ఫిర్యాదు నంబర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి నిరంతరం ప్రజల్లోనే సర్పంచ్ సంపత్



**ఎల్కతుర్తి జూన్ 26( తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలంలోని దండేపల్లి గ్రామంలో గ్రామాభివృద్ధే లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సర్పంచ్ గొల్లపల్లి సంపత్ నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. గ్రామంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నారు.ఇటీవల గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలోని ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌కు అనుసంధానమైన మెయిన్ పైప్‌లైన్ ఆకస్మికంగా దెబ్బతినడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న వెంటనే సర్పంచ్ గొల్లపల్లి సంపత్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. సంబంధిత సిబ్బందికి తక్షణ ఆదేశాలు జారీ చేసి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ, వీలైనంత త్వరగా గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరా పునరుద్ధరించేందుకు కృషి చేశారు.గ్రామంలో ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే స్పందించడం, ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం సర్పంచ్ సంపత్ ప్రత్యేకతగా గ్రామస్థులు పేర్కొంటున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ దండేపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని వారు అభినందిస్తున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ గొల్లపల్లి సంపత్ మాట్లాడుతూ, "ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి లోటు లేకుండా పనిచేస్తున్నాం. తాగునీరు, పారిశుద్ధ్యం, గ్రామాభివృద్ధి పనులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తాం. ప్రజల సహకారంతో దండేపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం" అని తెలిపారు

# నృత్యంలో ప్రతిభ చాటిన తన్వితకు బీసీ జేఏసీ ఘన సన్మానం



**హుజురాబాద్, జూన్ 26(తెలంగాణ ముచ్చట్లు ):** రాజమండ్రిలో నిర్వహించిన కళా సమ్మేళనం-2026 నృత్య ప్రదర్శన పోటీల్లో అద్భుత ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి సాధించిన వంగర గ్రామానికి చెందిన హుజురాబాద్ నివాసి బిల్లా తన్వితకు హుజురాబాద్ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. పట్టణంలోని పద్మాలయ క్లాత్ షోరూంలో జరిగిన కార్యక్రమంలో బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ ముఖ్య అతిథిగా పాల్గొని తన్వితను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాట్యాచార్యుడు వెంకటేశ్వర్లు శిక్షణలో తీర్చిదిద్దుకున్న తన్విత రాజమండ్రిలోని ఎస్సీఎం కళాక్షేత్రంలో నిర్వహించిన నృత్య పోటీల్లో ప్రథమ స్థానం సాధించడం హుజురాబాద్ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే అసాధారణ ప్రతిభ కనబర్చిన తన్విత భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి హుజురాబాద్ పేరును దేశవ్యాప్తంగా చాటాలని ఆకాంక్షించారు.

కళతో పాటు విద్యలోనూ రాణిస్తూ ఉన్నత స్థానాలను అధిరోహించి తల్లిదండ్రులకు, గురువులకు, స్వగ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. తన్విత సాధించిన విజయం ఇతర చిన్నారులకు కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ అధ్యక్షులు సందేల వెంకన్న, ప్రధాన కార్యదర్శి చిలుకమారి శ్రీనివాస్, ఇప్పకాయల సాగర్, పల్లె ప్రశాంత్, తాటిపాముల కనకయ్య, దేవసాని ప్రియదర్శిని, మంద బిక్షపతి, దొంత హరికిషన్, మంచికట్ల విజయ్ కుమార్, గాజర్ల బుచ్చిరాజం, మావునూరి ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి, జీవన్ కుమార్, పోగు సమ్మయ్య, రజినీకాంత్ తదితరులు పాల్గొని తన్వితతో పాటు ఆమె తల్లిదండ్రులు బిల్లా రాజ్‌కుమార్, దీప్తిలను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రామ పెద్దల సమక్షంలోనే భూ వివాదానికి తీర్పు

- **పీచర గ్రామస్తుల నిర్ణయానికే కట్టుబడి ఉంటాం: కుంద్రా ధర్మారెడ్డి"**



**వేలేరు, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** పీచర గ్రామంలో నెలకొన్న తమ కుటుంబ భూ వివాదాన్ని గ్రామ పెద్దలు, గ్రామస్తుల సమక్షంలోనే పరిష్కరించాలని కుంద్రా ధర్మారెడ్డి కోరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సుమారు 25 సంవత్సరాల క్రితం తన తల్లిదండ్రులు లక్ష్మి, వీరారెడ్డి గ్రామంలో అప్పులు చేసి తన వివాహానికి ముందే గ్రామాన్ని విడిచి వెళ్లారని తెలిపారు.ఆ సమయంలో తన సోదరి కృష్ణవేణి వారిని తన వెంట తీసుకెళ్లిందని, వారు చేసిన అప్పులను తానే గ్రామంలో ఉండి తీర్చానని చెప్పారు. తనకు వారసత్వంగా వచ్చిన 18 ఎకరాల భూమిని ఇప్పటి వరకు కాపాడుకుంటూ వస్తున్నానని తెలిపారు.

అయితే, కొంతకాలంగా తన సోదరి కృష్ణవేణి వారసత్వ భూమిలో తనకు వాటా కావాలని కేసులు వేస్తూ ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. అలాగే, తాను తన తల్లిదండ్రులను ఇంటికి తీసుకొచ్చిన విషయాన్ని కిడ్నాప్‌గా చిత్రీకరించడం సరికాదని అన్నారు.తమ కుటుంబ సమస్యను గ్రామంలోనే గ్రామ పెద్దలు, గ్రామ ప్రజల సమక్షంలో చర్చించి ఏ తీర్పు ఇస్తే దానికి తాము పూర్తిగా కట్టుబడి ఉంటామని ధర్మారెడ్డి కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు.

# గిరిజన అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి,జూన్26(తెలంగాణ ముచ్చట్లు):** గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తోందని, వారి సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఇందిరమ్మ ఆశీర్వాద సమావేశం స్వర్ణోత్సవ వేడుకల బస్సు యాత్ర సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.1976లోనే గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి వారి అభ్యున్నతికి బాటలు వేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు.రిజర్వేషన్ల ద్వారా గిరిజన కుటుంబాలకు విద్య, ఉపాధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో విస్తృత అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి గిరిజన ఆవాస ప్రాంతంలో సేవాలాల్ ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్, విద్యార్థులకు ఉన్నత విద్యలో ప్రోత్సాహం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా వంటి పథకాల ద్వారా ప్రజలకు మేలు జరుగుతోందని వివరించారు.ఇందిరా గాంధీ హయాం నుంచి గిరిజనులు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తున్నారని పేర్కొన్న ఎమ్మెల్యే, శనివారం వనపర్తి జిల్లా కేంద్రానికి రానున్న ఇందిరమ్మ ఆశీర్వాద స్వర్ణోత్సవ బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం గిరిజన నాయకులతో కలిసి బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో గిరిజన సర్పంచులు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, గిరిజన సంఘాల నాయకులు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# భీమదేవరపల్లిలో వర్షాల కోసం మహిళల ప్రత్యేక ప్రార్థనలు



- బొడ్రాయికి నీళ్లు పోసి, బతుకమ్మ ఆడి దేశ శ్రేయస్సు కోరిన మహిళలు

**భీమదేవరపల్లి జూన్26(తెలంగాణ ముచ్చట్లు):**భీమదేవరపల్లి గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, దేశం మొత్తం సుభిక్షంగా ఉండాలని కోరుతూ గ్రామ మహిళలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.
ముందుగా గ్రామ బొడ్రాయికి నీళ్లు పోసిన మహిళలు అనంతరం ఎల్లమ్మ ఆలయం వద్దకు చేరుకుని సంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆడి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంచి వర్షాలు కురవాలని, రైతాంగం సంతోషంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.
ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామ మహిళలు పాల్గొన్నారు. అలాగే గ్రామ పంచాయతీ సర్పంచ్ మాచర్ల కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ శనిగరం అయిలయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కాంగ్రెస్ నాయకుల ఫైర్



**మంచిర్యాల. జూన్ 26, (తెలంగాణ ముచ్చట్లు):**చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బాల్క సుమన్, మంత్రి వివేక్ వెంకటస్వామి పై చేసిన విమర్శలకు గాను మంచిర్యాల డిసిసి అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆగ్రహం వ్యక్తం చేశారు, శుక్రవారం మందమర్రి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం కోల్పోయి బాధ్యత రాహిత్యంగా ప్రజలను రెచ్చగొడుతూ సింగరేణి ఆస్తులను ధ్వంసం చేయమనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు, గతంలో బాల్క సుమన్ ఎంపి, ఎమ్మెల్యే గా పని చేసిన క్రమంలో రౌడీయిజం, భూకబ్జాలను ప్రోత్సహించారని ఆరోపించారు, ఇసుక రీచ్ లను ఏర్పాటుచేసి కోట్లాది రూపాయలు దండుకున్నది వాస్తవం కాదా అని అన్నారు, సింగరేణికి సంబంధించిన నిధులు సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ లాంటి ప్రాంతాలకు తరలించలేదా అని ఎద్దేవా చేశారు, మా నాయకుడు వివేక్ వెంకటస్వామి గెలిచిన తర్వాత భూ దందాలు, ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశారని గుర్తు చేశారు, స్థానికంగా స్కిల్ డెవలప్మెంట్ ఏర్పాటు చేసి టాస్క్ సంస్థ ద్వారా జర్మనీ సహా ఇతర దేశాలలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు, అవినీతి రహిత పాలన చేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి పై మరోసారి ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మంద తిరుమల్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్, సీనియర్ నాయకులు సంఘీ సంతోష్, పాషా, వీరన్న, రాచర్ల గణేష్, కిరణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# చలో కొడంగల్.. తెలంగాణ ఉద్యమకారుల పిలుపు




**జమ్మికుంట టౌన్ జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉద్యమకారుల హామీల అమలులో ముందడుగు వేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతగా కొడంగల్‌లో నిర్వహించనున్న సభను, చేవెళ్ల వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి కొడంగల్ వరకు చేపట్టనున్న "చలో కొడంగల్" కారు ర్యాలీని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎక్కడి సంజీవరెడ్డి పిలుపునిచ్చారు.
శుక్రవారం జమ్మికుంట ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను చేర్చడం, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేకే కమిటీని ఏర్పాటు చేయడం ఉద్యమకారుల విజయంగా అభివర్ణించారు. కమిటీ కాలయాపన చేయకుండా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్రంలోని 33 జిల్లాల ఉద్యమకారులతో పాటు కరీంనగర్ జిల్లా ఉద్యమకారులు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొని కారు ర్యాలీని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మూడేళ్ల కుమారస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరే రమేష్ రెడ్డి, రేణిగుంట్ల రజినీకుమార్, జమ్మికుంట టౌన్ అధ్యక్షుడు మద్దూరి శంకరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్ర భూమిరెడ్డి, ఉపాధ్యక్షులు రాంరాజబాబు, ఎజ్జే తిరుపతి, ఇమ్మడి రాజు, మోతే స్వామి, జిల్లా కార్యదర్శి కనవేని సతీష్ కుమార్, రచ్చ గణేష్, అక్కనపెల్లి నవీన్ కుమార్ పాల్గొన్నారు.

# 250 ఏళ్ల చరిత్ర కలిగిన జమ్మికుంట పీర్ల స్థలానికి రక్షణ కల్పించాలి

**జమ్మికుంట టౌన్ జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో సుమారు 250 సంవత్సరాల చరిత్ర కలిగిన పీర్ల పండుగ నేటికీ మతసామరస్యానికి ప్రతీకగా కొనసాగుతోందని ముస్లిం పెద్దలు తెలిపారు. అయితే ఇంతటి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన పీర్ల స్థలానికి కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రహరీ గోడ, శాశ్వత గది నిర్మించాలని ప్రజాప్రతినిధులు, దాతలను వారు కోరుతున్నారు.



ముస్లిం పెద్దలు తెలిపిన వివరాల ప్రకారం, ఎన్నో సంవత్సరాల క్రితం ఓ రైతు తన పొలాన్ని దున్నుతుండగా నాగలి కొసకు పీరీ తగిలి భూమి పైకి రావడంతో ఆ ప్రాంతం పవిత్ర స్థలంగా గుర్తించబడింది. అనంతరం గ్రామస్థుల సహకారంతో గౌడ కులానికి చెందిన భూదాతలు ఆ స్థలాన్ని పీర్లకు విరాళంగా అందించగా, అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఇక్కడే పీర్ల పండుగను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు.
ఈ పండుగలో ముస్లింలతో పాటు హిందూ సోదరులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకోవడం, మట్టికుండలు సమర్పించడం, గుండంలో నడవడం వంటి ఆచారాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంటారు. కోరికలు నెరవేరిన అనంతరం తిరిగి వచ్చి మొక్కులు తీర్చుకునే భక్తులు కూడా అధిక సంఖ్యలో ఉంటారని స్థానికులు పేర్కొన్నారు.
అయితే పీర్లను భద్రపరిచే శాశ్వత గది లేకపోవడంతో ఉత్సవాలు ముగిసిన తర్వాత వాటిని ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వస్తోందని, ఎండ, వానలకు గురవుతూ పీర్లకు నష్టం కలుగుతోందని ముస్లిం పెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు.
దాతలు విరాళంగా ఇచ్చిన స్థలంలో ప్రహరీ గోడతో పాటు ఒక గది నిర్మిస్తే పీర్లను శాశ్వతంగా అక్కడే భద్రపరచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతం నుంచి పలువురు ప్రజాప్రతినిధులు ఎన్నికైనప్పటికీ ఇప్పటివరకు ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని వారు అన్నారు.
ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, దాతలు స్పందించి చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ పీర్ల స్థలాన్ని అభివృద్ధి చేసి, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ముస్లిం పెద్దలు, గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

# ఆగస్టు 15కే కల్లూరుగూడెం ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

- పనులు వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం.
- ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానం.
- పరిశ్రమలతో ఖమ్మం జిల్లా అభివృద్ధికి మరింత ఊతం.

**వేంసూరు, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** కల్లూరుగూడెంలోని ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ఆగస్టు 15 నాటికి ప్రారంభించేలా మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం వేంసూరు మండలం కల్లూరుగూడెంలో నిర్మాణంలో ఉన్న ఫ్యాక్టరీని పరిశీలించిన ఆయన, నిర్మాణ పురోగతి, యంత్రాల ఏర్పాటు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి పనిని నిర్దేశిత గడువులో పూర్తి చేసి స్వాతంత్ర్య దినోత్సవం నాటికి ఫ్యాక్టరీని రైతులకు అంకితం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించేందుకు ఆయిల్‌పామ్ సాగు విస్తరణ అత్యంత అవసరమన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 15.70 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతుండగా, భవిష్యత్తులో దీన్ని 70 లక్షల ఎకరాలకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్‌పామ్ పథకం కింద గత ఐదేళ్లలో దేశంలో కొత్తగా సాగులోకి వచ్చిన 6.82 లక్షల



ఎకరాల్లో 2.44 లక్షల ఎకరాలు తెలంగాణలోనే నమోదయ్యాయని తెలిపారు. అంటే దేశవ్యాప్తంగా కొత్తగా విస్తరించిన ఆయిల్‌పామ్ సాగులో 36 శాతం తెలంగాణ వాటా ఉండటం రాష్ట్రం సాధించిన గొప్ప విజయమని పేర్కొన్నారు. దీంతో ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 79,448 మంది రైతులు 2.94 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని, రానున్న రెండుమూడు సంవత్సరాల్లో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రైతులు పండించిన పంటకు సకాలంలో ప్రాసెసింగ్ సౌకర్యం కల్పించేందుకు ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గతంలో రాష్ట్రంలో కేవలం రెండు ఫ్యాక్టరీలు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం కొత్త యూనిట్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఇటీవల సిద్ధిపేటలో కొత్త ఫ్యాక్టరీ ప్రారంభించామని, కల్లూరుగూడెం ఫ్యాక్టరీ కూడా తుది దశకు చేరుకుందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఆయిల్‌పామ్ గెలల ధర టన్నుకు రూ.12 వేలుగా ఉండేదని, ప్రభుత్వ కృషితో ప్రస్తుతం రూ.23,852కు పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. బుగ్గపాడులో ఏర్పాటు అవుతున్న పరిశ్రమతో పాటు మరో రెండు మూడు నెలల్లో మరికొన్ని పరిశ్రమలు కూడా జిల్లాకు రానున్నాయని తెలిపారు. వీటి ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గ ప్రజల విశ్వాసంతో పాటు శ్రీరామచంద్రుని ఆశీస్సులతో జిల్లాలో మిగిలిన అభివృద్ధి పనులను కూడా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణను విజయవంతం చేయాలి

- సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్

**పెద్దమండడి,జూన్26(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమండడి మండలం మణిగిల్ల గ్రామంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల పేర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను సక్రమంగా పూర్తి చేయాలని సూచించారు. నకిలీ, ద్వంద్వ ఓట్ల తొలగింపుతో పాటు



అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.వచ్చే నెల 20వ తేదీ వరకు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం కొనసాగనున్నందున, ఇంటి వద్దకు వచ్చే అధికారులకు అవసరమైన వివరాలు అందించి, తమ ఓటరు వివరాలను పరిశీలించి సరిచేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, గ్రామ స్థాయి ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సేవే లక్ష్యంగా నూతన పాలకవర్గం

*అధ్యక్షుడిగా కొలిపాక సంపత్..*

**జమ్మికుంట టౌన్ జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లిలో గల బాలాజీ చేనేత సహకార సంఘం పాలకవర్గ ఎన్నికలు శుక్రవారం ఎన్నికల అధికారి శ్రీమతి అరుణ జ్యోతి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నిర్వహించారు.
ఈ ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా కొలిపాక సంపత్, ఉపాధ్యక్షుడిగా ఆడెపు రాజయ్య, కోశాధికారిగా వల్లంపట్ల బాబు ఎన్నికయ్యా



రు. పాలకవర్గ సభ్యులుగా మూడుతనపల్లి రమేష్, శ్రీరాం రాజు, మహారాజు స్వరూప, శారద, ఓల్లాల రజిత, మూడుతనపల్లి రాజమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను కోర్కల్ చేనేత సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, జమ్మికుంట చేనేత సంఘం అధ్యక్షుడు రమేష్, కొత్తపల్లి మాజీ సర్పంచ్ బొద్దుల రవీందర్, చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు కొంపల్లి రాజయ్య, సంఘ నాయకుడు ఆడెపు రాజనర్స తదితరులు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గం చేనేత కార్మికుల సంక్షేమం, సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చింది.



# యువశక్తే భవిష్యత్

దేశ భవిష్యత్తును నిర్దేశించే శక్తి యువత చేతుల్లోనే ఉంది. విద్య పూర్తి చేసిన ప్రతి యువకుడు ఉద్యోగం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నుంచి బయటపడి, స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తే ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుంది. ఉద్యోగం కోసం పోటీ పడే వారి సంఖ్య పెరుగుతున్న తరుణంలో అవకాశాలను సృష్టించే యువ పారిశ్రామికవేత్తల అవసరం మరింత పెరుగుతోంది. ప్రస్తుతం సమాచార సాంకేతికత, ఆహార ప్రాసెసింగ్, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, సేవారంగం, డిజిటల్ వ్యాపారం, పర్యాటకం వంటి అనేక రంగాల్లో యువతకు అపార అవకాశాలు ఉన్నాయి. తక్కువ పెట్టుబడితోనే కొత్త వ్యాపారాలను ప్రారంభించి స్థానికంగా, జాతీయ స్థాయిలో మార్కెట్‌ను విస్తరించే పరిస్థితులు ఏర్పడ్డాయి. సృజనాత్మక ఆలోచనలకు సాంకేతికత తోడైతే విజయావకాశాలు మరింత పెరుగుతున్నాయి.
సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు యువతకు ఉపాధి కల్పించడమే కాకుండా, వారినే ఉపాధి కల్పించే స్థాయికి తీసుకెళ్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు, సబ్సిడీలు, శిక్షణ కార్యక్రమాలు, పారిశ్రామిక ప్రోత్సాహక పథకాల ద్వారా యువతను ప్రోత్సహిస్తున్నాయి. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే చిన్న పరిశ్రమలను పెద్ద సంస్థలుగా అభివృద్ధి చేయవచ్చు. విద్యాసంస్థలు కూడా ఉద్యోగాలకే పరిమితమైన శిక్షణ కాకుండా పారిశ్రామిక దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక నిర్వహణ, మార్కెటింగ్, సాంకేతిక వినియోగం వంటి అంశాల్లో యువతకు శిక్షణ అందిస్తే స్వయం ఉపాధి పట్ల ఆసక్తి మరింత పెరుగుతుంది.
ఒక యువకుడు ఉద్యోగం పొందితే ఒక కుటుంబం అభివృద్ధి చెందుతుంది. అదే ఒక యువకుడు పరిశ్రమ స్థాపించి పదిమందికి ఉపాధి కల్పిస్తే సమాజం అభివృద్ధి చెందుతుంది. యువతలో అవకాశాలను సృష్టించే ఆలోచన పెరిగినప్పుడే నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. అభివృద్ధి చెందిన దేశాలన్నీ యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారానే ఆర్థికంగా బలపడ్డాయి. అదే మార్గంలో భారత యువత కూడా నవ్య ఆలోచనలు, పట్టుదల, సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగితే ప్రపంచ స్థాయిలో విజయాలు సాధించడం సాధ్యమే. ఉద్యోగం కోసం ఎదురు చూసే యువత నుంచి అవకాశాలను సృష్టించే యువతగా మారడమే దేశాభివృద్ధికి అసలైన బాట.

# మహిళా పారిశ్రామికవేత్తలకు మరింత ప్రోత్సాహం అవసరం



ఒకప్పుడు మహిళల పాత్ర ఇంటి నిర్వహణకే పరిమితమనే భావన సమాజంలో బలంగా ఉండేది. కానీ కాలం మారింది. విద్య, సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, కుటుంబాల మద్దతుతో నేడు మహిళలు ప్రతి రంగంలోనూ తమ ప్రతిభను చాటుకుంటున్నారు. ఉద్యోగాలకే పరిమితం కాకుండా పరిశ్రమలను స్థాపిస్తూ ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతున్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో మహిళా పారిశ్రామికవేత్తల పాత్ర రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ, వారికి అవసరమైన స్థాయిలో ప్రోత్సాహం ఇంకా అందడం లేదు. మహిళలలో ఉన్న వ్యాపార నైపుణ్యాన్ని వెలికితీసి, వారికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం దేశాభివృద్ధికి ఎంతో అవసరం. భారతదేశంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధిలో మహిళల పాత్ర విశేషంగా పెరుగుతోంది. ఆహార ఉత్పత్తులు, వస్త్ర తయారీ, చేనేత, హస్తకళలు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, సౌందర్య ఉత్పత్తులు, సేవారంగం, సమాచార సాంకేతికత, ఆన్‌లైన్ వ్యాపారాలు వంటి అనేక రంగాల్లో మహిళలు విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా నిలుస్తున్నారు. చిన్న స్థాయిలో ప్రారంభించిన వ్యాపారాలను పెద్ద సంస్థలుగా అభివృద్ధి చేసిన మహిళలు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.
మహిళల నాయకత్వంలో నడిచే పరిశ్రమలు కేవలం లాభాలకే పరిమితం కావు. అవి సమాజంలో మరెంతో మందికి ఉపాధి కల్పిస్తాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రారంభమైన చిన్న పరిశ్రమలు వేలాది కుటుంబాలకు ఆదాయ వనరులుగా మారాయి. ఊరగాయలు, పప్పు దినుసులు, సేంద్రియ ఉత్పత్తులు, పాల ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు, చేతివృత్తుల ఉత్పత్తులు వంటి ఎన్నో వస్తువులు దేశవ్యాప్తంగా మార్కెట్‌ను సొంతం చేసుకుంటున్నాయి. ఈ విజయాల వెనుక మహిళల కృషి, పట్టుదల, నిర్వహణా సామర్థ్యం స్పష్టంగా కనిపిస్తుంది. అయితే మహిళలు పరిశ్రమలు స్థాపించే సమయంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. రుణాల లభ్యత, ఆర్థిక వనరుల కొరత, మార్కెట్ అవకాశాలపై సరైన అవగాహన లేకపోవడం, కుటుంబ బాధ్యతలు, సామాజిక పరిమితులు, శిక్షణ లోపం వంటి అంశాలు వారి ఎదుగుదలకు అడ్డంకులుగా మారుతున్నాయి. కొన్ని సందర్భాల్లో వ్యాపార రంగంలో మహిళల సామర్థ్యంపై ఇంకా అనుమానాలు వ్యక్తమవుతుండటం కూడా బాధాకరమైన విషయమే.
ప్రభుత్వాలు మహిళల కోసం ప్రత్యేక రుణ పథకాలు, సబ్సిడీలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, వ్యాపార మార్గదర్శక కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ వాటి ప్రయోజనాలు ప్రతి అర్హురాలికి చేరడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో సమాచారం అందుబాటులో లేకపోవడం వల్ల అనేక మంది మహిళలు ఈ అవకాశాలను వినియోగించుకోలేక పోతున్నారు. ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించడం అవసరం. డిజిటల్ యుగం మహిళా పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలను తెరిచింది. ఆన్‌లైన్ విక్రయ వేదికలు, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ చెల్లింపులు, ఇంటి నుంచే వ్యాపార నిర్వహణ వంటి అవకాశాలు మహిళలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. పెద్ద దుకాణాలు లేకుండానే దేశవ్యాప్తంగా, విదేశాల్లోనూ వినియోగదారులను చేరుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ అవకాశాలను సమర్థంగా వినియోగించుకునేలా డిజిటల్ నైపుణ్యాలను మరింత పెంపొందించాల్సిన అవసరం ఉంది. విద్యాసంస్థలు కూడా మహిళల్లో పారిశ్రామిక దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలి. కళాశాల స్థాయి నుంచే వ్యాపార నిర్వహణ, ఆర్థిక ప్రణాళిక, మార్కెటింగ్, డిజిటల్ వాణిజ్యం వంటి అంశాలపై శిక్షణ అందిస్తే భవిష్యత్తులో మరింత మంది మహిళలు పరిశ్రమల స్థాపన వైపు అడుగులు వేస్తారు. యువతలో స్వయం ఉపాధి భావనను పెంపొందించడం కాలానుగుణ అవసరం. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం కూడా మహిళా పారిశ్రామికవేత్తల విజయానికి ఎంతో కీలకం. మహిళలు వ్యాపారం చేయాలనే నిర్ణయం తీసుకున్నప్పుడు వారికి మానసికంగా, ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలవాలి. కుటుంబం, సమాజం, ప్రభుత్వం కలిసి సహకరిస్తే మహిళలు ప్రపంచ స్థాయి సంస్థలను కూడా విజయవంతంగా నడిపించగలరని ఇప్పటికే అనేక ఉదాహరణలు నిరూపించాయి. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే కుటుంబాలు బలోపేతం అవుతాయి. కుటుంబాలు అభివృద్ధి చెందితే సమాజం అభివృద్ధి చెందుతుంది. సమాజం అభివృద్ధి చెందితే దేశం మరింత వేగంగా పురోగమిస్తుంది. అందుకే మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం అనేది కేవలం మహిళల అభివృద్ధికి సంబంధించిన అంశం మాత్రమే కాదు, దేశ ఆర్థికాభివృద్ధికి సంబంధించిన కీలక అంశం కూడా. మహిళల్లో అపారమైన ప్రతిభ, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు ఉన్నాయి. వాటిని గుర్తించి తగిన అవకాశాలు, శిక్షణ, ఆర్థిక సహాయం, మార్కెట్ సదుపాయాలు కల్పించడం ప్రభుత్వాలు, ఆర్థిక సంస్థలు, పరిశ్రమల సంఘాలు, సమాజం అందరి బాధ్యత. మహిళా పారిశ్రామికవేత్తలకు మరింత ప్రోత్సాహం అందినప్పుడే సమాన అవకాశాలతో కూడిన, బలమైన, స్వయం సమృద్ధి భారత నిర్మాణం వేగవంతమవుతుంది.

# ఉపాధి సృష్టికి.. ఆర్థికాభివృద్ధికి చిన్న పరిశ్రమలే బలమైన పునాది

ప్రతి సంవత్సరం జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఈ పరిశ్రమలు పోషిస్తున్న విశిష్ట పాత్రను గుర్తిస్తూ, వాటి ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహన పెంచడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశం. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో, పేదరిక నిర్మూలనలో, ఉపాధి కల్పనలో, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ఈ రంగం చేస్తున్న సేవలు అమోఘమైనవి. అందుకే ప్రపంచ దేశాలు ఈ రంగాన్ని అభివృద్ధికి మూలస్తంభంగా భావిస్తున్నాయి. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయి. వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న రంగం ఇదే. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఈ పరిశ్రమల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణాల్లోనూ సమానంగా అభివృద్ధి అవకాశాలను సృష్టించడంలో ఈ పరిశ్రమల పాత్ర అత్యంత కీలకమైనది. చిన్న పరిశ్రమల ప్రత్యేకత ఏమిటంటే స్థానికంగా లభించే వనరులను వినియోగించి స్థానిక అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు తయారు చేయడం. ఆహార పదార్థాలు, వస్త్రాలు, చేతివృత్తుల ఉత్పత్తులు, లోహ వస్తువులు, వ్యవసాయ పరికరాలు, ఔషధాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, సేవారంగం వంటి అనేక విభాగాల్లో ఈ పరిశ్రమలు విశేష సేవలందిస్తున్నాయి. దేశీయ అవసరాలతో పాటు ఎగుమతుల ద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని కూడా సంపాదిస్తున్నాయి. నేటి యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడానికి ఈ రంగం మంచి అవకాశాలను కల్పిస్తోంది. తక్కువ పెట్టుబడితో పరిశ్రమలను ప్రారంభించే అవకాశం ఉండటం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుబాటులో ఉండటంతో యువ పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. కొత్త ఆలోచనలకు, వినూత్న ఆవిష్కరణలకు ఈ రంగం వేదికగా మారుతోంది. మహిళా సాధికారతలో కూడా సూక్ష్మ, చిన్న పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు పలు ఉత్పత్తులను తయారు చేస్తూ కుటుంబ ఆదాయాన్ని పెంచుతున్నారు. ఆహార ఉత్పత్తులు, హస్తకళలు, వస్త్ర తయారీ, సేంద్రియ ఉత్పత్తులు వంటి రంగాల్లో మహిళలు విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు. గ్రామీణ మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంలో ఈ రంగం విశేషంగా దోహదపడుతోంది. దేశ ఆర్థికాభివృద్ధిలో ఎగుమతులు కీలకమైనవి. ఇందులో కూడా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పాత్ర ఎంతో గొప్పది. భారతీయ హస్తకళలు, చేనేత వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, ఔషధాలు, ఆహార పదార్థాలు వంటి అనేక వస్తువులు ప్రపంచ మార్కెట్లకు చేరుతున్నాయి. దీంతో దేశానికి విదేశీ మారకద్రవ్యం సమకూరడంతో పాటు భారతీయ ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు కూడా లభిస్తోంది. అయితే ఈ రంగం పలు సవాళ్లను కూడా ఎదుర్కొంటోంది. ముడి సరుకు ధరల పెరుగుదల, రుణాల లభ్యతలో ఇబ్బందులు, మార్కెట్ పోటీ, నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు చిన్న పరిశ్రమల అభివృద్ధికి అడ్డంకులుగా మారుతున్నాయి. వీటిని అధిగమించేందుకు ప్రభుత్వం, బ్యాంకులు, పరిశ్రమల సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. డిజిటల్ సాంకేతికత అందుబాటులోకి రావడంతో చిన్న పరిశ్రమలకు కొత్త అవకాశాలు ఏర్పడ్డాయి. ఆన్‌లైన్ విక్రయాలు, డిజిటల్ చెల్లింపులు, సామాజిక మాధ్యమాల ప్రచారం, ఈవాణిజ్య వేదికల ద్వారా తమ ఉత్పత్తులను దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా విక్రయించే అవకాశం లభిస్తోంది. దీంతో చిన్న పరిశ్రమలు పెద్ద మార్కెట్లను చేరుకునే పరిస్థితి ఏర్పడింది. స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా ప్రతి వినియోగదారుడు చిన్న పరిశ్రమలకు అండగా నిలవవచ్చు. స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. దేశీయ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగి పరిశ్రమలు మరింత విస్తరించే అవకాశం ఉంటుంది. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ దిశగా చైతన్యంతో ముందుకు రావాలి.



శనివారం - 27 - జూన్ 2026

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# హిట్ కోసం ఎదురుచూస్తున్న కేతిక శర్మ

టాలీవుడ్‌లో యువ నటి కేతిక శర్మ ఇప్పటికీ తన తొలి భారీ విజయాన్ని కోసం ఎదురుచూస్తున్నారు. రొమాంటిక్ సినిమాతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె, మొదటి చిత్రంతోనే గ్లామర్ గర్ల్‌గా గుర్తింపు సంపాదించినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయారు.

ఆకాష్ పూరి సరసన నటించిన తొలి సినిమా ప్రేక్షకుల్లో గుర్తింపు తీసుకువచ్చినప్పటికీ వసూళ్ల పరంగా పెద్ద విజయం సాధించలేదు. ఆ తర్వాత నాగశౌర్యతో నటించిన 'లక్ష్య' కూడా ఆమెకు నిరాశనే మిగిల్చింది. వైష్ణవ్ తేజ్‌తో చేసిన రంగ రంగ వైభవంగా' సినిమా కూడా డిజాస్టర్‌గా నిలవడంతో వరుసగా అవకాశాలు ఆశించినంతగా రాలేదు. పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో వచ్చిన 'బ్రో' చిత్రంపై ఆమె భారీ ఆశలు పెట్టుకున్నప్పటికీ, ఆ సినిమా కూడా కేతిక కెరీర్‌కు పెద్ద ఊతం ఇవ్వలేకపోయింది. దీంతో ప్రస్తుతం ఆమెకు పెద్దగా సినిమా అవకాశాలు తగ్గినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే సోషల్ మీడియాలో మాత్రం కేతిక శర్మ చాలా యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. గ్లామరస్ ఫోటోలు, వీడియోలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ తన క్రేజ్‌ను నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. త్వరలోనే మంచి స్క్రిప్ట్‌తో మళ్లీ వెండితెరపై బలమైన కమ్‌బ్యాక్ ఇవ్వాలనే ఆశతో ఆమె ఎదురుచూస్తున్నారు.



# శృతి హాసన్ క్లారిటీ.. ప్రస్తుతం రిలేషన్‌షిప్‌లో లేను

సినీ నటి శృతి హాసన్ వ్యక్తిగత జీవితం గురించి గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆమె ప్రేమ వ్యవహారంపై వస్తున్న ప్రచారాలకు తాజాగా ఆమె స్వయంగా స్పందిస్తూ పూర్తి స్పష్టత ఇచ్చారు. అభిమానులతో నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సందేహాలకు సమాధానమిచ్చారు.

ఈ సందర్భంగా ఓ అభిమాని ప్రస్తుతం ఎవరితోనైనా ప్రేమ సంబంధంలో ఉన్నారా అని ప్రశ్నించగా, తాను ప్రస్తుతం ఎవరితోనూ ఎలాంటి ప్రేమ సంబంధంలో లేనని శృతి హాసన్ స్పష్టం చేశారు. దీంతో ఆమె డేటింగ్ గురించి గత కొంతకాలంగా ప్రచారంలో ఉన్న వార్తలకు తెరపడింది.

మరో అభిమాని నటిగా కాకపోతే ఏ వృత్తిని ఎంచుకునేవారని ప్రశ్నించగా, చిన్నారుల మానసిక వైద్యురాలిగా మారాలని తనకు ఆసక్తి ఉండేదని శృతి తెలిపారు. ఆమె ఇచ్చిన ఈ సమాధానం కూడా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది. తెలుగు, తమిళం, హిందీ చిత్రాల్లో వరుస విజయాలతో గుర్తింపు తెచ్చుకున్న శృతి హాసన్ ప్రస్తుతం సినిమాల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. తక్కువ చిత్రాలు చేస్తున్నప్పటికీ అభిమానులతో మాత్రం సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం మమేకమవుతున్నారు.

ఇటీవల రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రంలో ప్రత్యేక గీతంలో కనిపించిన శృతి హాసన్ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అలాగే ఆమె నటించనున్న 'సలార్-2' చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది చివర్లో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లకు స్వయంగా సమాధానం ఇవ్వడంతో శృతి హాసన్ వ్యాఖ్యలు విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.





# నటి ఇంట్లో వ్యాపారవేత్త ఆత్మహత్య

బెంగళూరులోని ఆర్‌ఆర్ నగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. కన్నడ నటి, మోడల్, మాజీ బిగ్‌బాస్ కన్నడ పోటీదారు కృషి తపాండ నివాసంలో 33 ఏళ్ల వ్యాపారవేత్త వైశాఖ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గిరినగర్‌కు చెందిన వైశాఖ్ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు అసహజ మరణంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల వివరాల ప్రకారం, గత కొన్ని రోజులుగా వైశాఖ్ ఆర్‌ఆర్ నగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. ఘటన జరిగిన సమయంలో కృషి తపాండ ఇంట్లో అతను ఒంటరిగా ఉన్నట్లు గుర్తించారు. ఘటనా స్థలంలో ఎలాంటి ఆత్మహత్యా లేఖ గానీ, వీడియో సందేశం గానీ లభించలేదని పోలీసులు వెల్లడించారు.

ఘటనకు కొద్దిసేపటి ముందు వైశాఖ్ కృషి తపాండను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఆ సమయంలో ఆమె నెలమంగళలో ఉండటంతో ఫోన్‌కు స్పందించలేకపోయినట్లు తెలిసింది. అనంతరం తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు సూచించే సందేశాలను ఆమెకు పంపినట్లు సమాచారం. ఆ సందేశాలను గమనించిన కృషి వెంటనే వైశాఖ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే వారు అక్కడికి చేరుకునేలోపే వైశాఖ్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఘటన అనంతరం వైశాఖ్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మరణానికి గల కారణాలను గుర్తించేందుకు ఫోన్ వివరాలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నారు.

ఇదిలా ఉండగా, ఈ ఏడాది ప్రారంభంలో వైశాఖ్ మరో కేసులో కూడా అరెస్టయ్యాడు. వ్యాపారవేత్త అరవింద్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెదిరింపులు, దోపిడీ ఆరోపణలతో నమోదైన కేసులో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బెయిల్‌పై విడుదలైనట్లు సమాచారం.


కృషి తపాండ 2016లో 'అకీర' చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టారు. అనంతరం 'ఎరడు కనసు', 'కన్నడక్కాగి ఒందన్ను ఒత్తి' చిత్రాల్లో నటించారు. అలాగే బిగ్‌బాస్ కన్నడ ఐదో సీజన్‌లో పాల్గొని గుర్తింపు పొందారు. ఇటీవల 'గణ' చిత్రంలోనూ కీలక పాత్రలో కనిపించారు. ఈ ఘటనపై కృషి తపాండ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

# జైలు నుంచి విడుదలైన బాల్క సుమన్

- బెయిల్ అనంతరం కేటీఆర్‌తో భేటీ
- ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్య
- రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైన భేటీ



హైదరాబాద్, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు): బెయిల్‌పై విడుదలైన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జైలు నుంచి విడుదలైన అనంతరం జరిగిన ఈ భేటీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా ఇద్దరూ ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల నమోదైన కేసులో అరెస్టై 27 రోజుల పాటు జైలులో ఉన్న బాల్క సుమన్‌కు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంతో ఆయన విడుదలయ్యారు. విడుదల అనంతరం పార్టీ ముఖ్య నేతలను కలుస్తూ ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగానే కేటీఆర్‌ను కలిసి తాజా పరిణామాలపై చర్చించారు.
ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, సింగరేణిలో జరుగుతున్న అంశాలు, ప్రజా సమస్యలను ప్రశ్నించినందుకే బాల్క సుమన్‌పై కేసులు నమోదు చేశారని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఆయనను జైలుకు పంపించారని పార్టీ నేతలు విమర్శించారు. అయితే ఈ కేసులన్నీ న్యాయస్థానంలో తేలుతాయని, ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని బాల్క సుమన్ పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రజా ప్రయోజనాల కోసం వెనుకడుగు వేయబోమని ఆయన స్పష్టం చేసినట్లు తెలిపాయి. కేటీఆర్ కూడా బాల్క సుమన్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు న్యాయబద్ధమైన పోరాటాన్ని కొనసాగించాలని సూచించినట్లు సమాచారం. బీఆర్ఎస్ నాయకులు పలువురు ఈ భేటీలో పాల్గొన్నారు. బాల్క సుమన్ విడుదల అనంతరం జరిగిన ఈ భేటీ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. దీనిపై అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. కేసు విచారణ న్యాయస్థానంలో కొనసాగుతున్న నేపథ్యంలో తదుపరి పరిణామాలపై రాజకీయ వర్గాలు దృష్టి సారించాయి.





# పారిశ్రామికాభివృద్ధే ప్రజల సంక్షేమానికి పునాది

- ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో–2026 ప్రారంభం
- ఎంఎస్‌ఎంఈలు, మహిళా పారిశ్రామికవేత్తలకు మరింత ప్రోత్సాహం
- పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం : భట్టి విక్రమార్క




హైదరాబాద్, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్‌లో నిర్వహించిన ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో-2026ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పారిశ్రామిక ప్రదర్శనను పరిశీలించి పలు సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధి అంటే కేవలం పెట్టుబడుల గణాంకాలు మాత్రమే కాదని, అది ప్రజలకు ఉపాధి కల్పించే శక్తిగా ప్రభుత్వం భావిస్తోందన్నారు. పరిశ్రమల విస్తరణతో యువతకు ఉద్యోగాలు, గ్రామీణ ప్రాంతాలకు ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.
సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ప్రతి శుక్రవారం పారిశ్రామిక రంగ ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తూ పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం సృష్టిస్తున్నామని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు, రీజనల్ రింగ్ రోడ్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి మరింత ఊతమిస్తాయని భట్టి విక్రమార్క అన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సాంకేతిక ఆవిష్కరణలు, నూతన పరిశ్రమలు, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ ముందంజలో నిలిచేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.



# బీర్‌పూర్‌లో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

- గ్రామీణులకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం
- ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాలని సూచన
- వైద్య సిబ్బంది, మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశం
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



జగిత్యాల, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు): జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.
ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాలకు ఆధునిక వైద్య సేవలను చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని సౌకర్యాలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది, అవసరమైన మందులు, వైద్య పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.
నూతన ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి సేవలు, ప్రాథమిక చికిత్స, టీకాలు, సాధారణ వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు వంటి సేవలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సమయానికి వైద్య సేవలు అందించడం ద్వారా ఆరోగ్య సమస్యలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత, వైద్య సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కొత్త ఆరోగ్య కేంద్రం ప్రారంభం కావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



# కాముని చెరువు పునరుద్ధరణ పనులకు శ్రీకారం

- వరదల నియంత్రణ, భూగర్భ జలాల పెంపే లక్ష్యం
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చేతుల మీదుగా భూమిపూజ
- ప్రజలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా అభివృద్ధికి చర్యలు

హైదరాబాద్, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు): వరదల నియంత్రణ, భూగర్భ జలాల పెంపుదల లక్ష్యంగా కూకట్‌పల్లి మండలం మూసాపేటలోని 48 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాముని చెరువు పునరుద్ధరణ పనులకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు. చెరువు పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెరువులో పేరుకుపోయిన పూడికను పూర్తిస్థాయిలో తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లను ఆధునికీకరించి వర్షపు నీటి ప్రవాహం సాఫీగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.
చెరువును కేవలం నీటి వనరుగా మాత్రమే కాకుండా ప్రజలకు ఆహ్లాదకరమైన విహార ప్రదేశంగా తీర్చిదిద్దాలని కమిషనర్ సూచించారు. ఇందులో భాగంగా వాకింగ్ పాత్‌వేలు, ఓపెన్ జిమ్, పిల్లల ఆట స్థలం, పచ్చదనం పెంపు వంటి సౌకర్యాలను అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
కాముని చెరువు పునరుద్ధరణతో వరద ముప్పు తగ్గడంతో పాటు భూగర్భ జలాల మట్టాలు పెరిగి పరిసర ప్రాంతాలకు మేలు జరుగుతుందని అధికారులు తెలిపారు. చెరువు పరిరక్షణ ద్వారా పర్యావరణ సమతుల్యత కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. భూమిపూజ కార్యక్రమంలో హైడ్రా అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. చెరువు పునరుద్ధరణతో మూసాపేట ప్రాంత ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



# నీట్ రీ పరీక్ష ఆన్సర్ కీ విడుదల

- జూన్ 28 వరకు అభ్యంతరాలు స్వీకరణ
- ప్రశ్నకు రూ.200 చెల్లించి సవాళ్లు నమోదు చేసే అవకాశం
- ఫలితాల విడుదలకు ఎన్‌టీఏ ఏర్పాట్లు




న్యూఢిల్లీ, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు): నీట్ యూజీ-2026 రీ పరీక్షకు సంబంధించిన ప్రొవిజినల్ ఆన్సర్ కీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ గురువారం విడుదల చేసింది. జూన్ 21న నిర్వహించిన రీ పరీక్షకు హాజరైన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయి ఆన్సర్ కీని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎన్‌టీఏ వెల్లడించింది. పరీక్షలో ఇచ్చిన సమాధానాలపై అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని నమోదు చేసుకునే అవకాశాన్ని కూడా కల్పించింది. ప్రొవిజినల్ ఆన్సర్ కీపై అభ్యంతరాలను ఈ నెల 28వ తేదీ రాత్రి 11.50 గంటల వరకు ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని ఎన్‌టీఏ తెలిపింది. ప్రతి ప్రశ్నపై అభ్యంతరం నమోదు చేయడానికి రూ.200 చొప్పున ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. అభ్యంతరాలను సమర్థించే పత్రాలను కూడా తప్పనిసరిగా జత చేయాలని సూచించింది.
అభ్యర్థులు తమ అభ్యంతరాలను ఒక్కసారి మాత్రమే సమర్పించాల్సి ఉంటుందని, ఒకసారి దరఖాస్తు పంపించిన తర్వాత మార్పులు చేసే అవకాశం ఉండదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. అందువల్ల సమర్పించే ముందు అన్ని వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించింది. అనంతరం నిపుణుల కమిటీ అన్ని అభ్యంతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనుంది. అభ్యర్థుల అభ్యంతరాలు సరైనవిగా తేలితే వారు చెల్లించిన ఫీజును తిరిగి చెల్లిస్తామని ఎన్‌టీఏ వెల్లడించింది. నిపుణుల పరిశీలన అనంతరం తుది ఆన్సర్ కీని విడుదల చేసి, దాని ఆధారంగానే ఫలితాలను ప్రకటించనుంది. తుది ఆన్సర్ కీపై ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించబోమని కూడా స్పష్టం చేసింది.
ఈసారి నీట్ స్కోర్ల ఆధారంగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ప్రవేశాలపై ఇప్పటికే అంచనాలు వెలువడుతున్నాయి. 650 నుంచి 720 మార్కులు సాధించిన వారికి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. 600 నుంచి 649 మార్కులు సాధించిన వారికి కూడా ప్రభుత్వ కళాశాలల్లో అవకాశాలు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ప్రవేశాల తుది పరిస్థితి రాష్ట్రాల వారీగా ఉండే కటాఫ్ మార్కులు, రిజర్వేషన్ విధానం, అభ్యర్థుల సంఖ్య, మొత్తం ఫలితాలపై ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల ప్రస్తుతం ప్రచారంలో ఉన్న మార్కుల అంచనాలను సూచికగా మాత్రమే పరిగణించాలని, తుది కౌన్సెలింగ్ నోటిఫికేషన్ తర్వాతే పూర్తి స్పష్టత వస్తుందని పేర్కొంటున్నారు.

# ఝార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- వ్యాను–ట్రక్కు ఢీకొని ఏడుగురు దుర్మరణం
- పెళ్లి కార్యక్రమం ముగించుకుని వస్తుండగా విషాదం
- ఒకరి పరిస్థితి విషమం.. కేసు నమోదు చేసిన పోలీసులు

రాంచీ, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు): ఝార్ఖండ్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడగా అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రామ్‌గఢ్-బొకారో ప్రధాన రహదారిపై రాజ్‌రప్ప పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వ్యాను, ఎదురుగా వస్తున్న ట్రక్కు బలంగా ఢీకొనడంతో వాహనం పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వ్యానులో చిక్కుకున్న వారిని బయటకు తీసే ప్రయత్నం చేసినప్పటికీ ఏడుగురు అప్పటికే మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని వెంటనే రామ్‌గఢ్ సదర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.
గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ప్రాథమిక సమాచారం ప్రకారం మృతులంతా పెళ్లి వేడుకల్లో బ్యాండ్ వాయించే కళాకారులు. హజారీబాగ్ జిల్లాలోని బల్సాగ్రా గ్రామంలో జరిగిన వివాహ కార్యక్రమంలో పాల్గొని స్వస్థలాలకు తిరుగు ప్రయాణం చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. ఒక్కసారిగా జరిగిన ఈ ప్రమాదం వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.
ప్రమాదానికి అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ లేదా ఇతర సాంకేతిక కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ట్రక్కు డ్రైవర్ వివరాలను సేకరిస్తున్న అధికారులు ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులపై విచారణ చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, వాహనాల పరిస్థితిని పరిశీలించిన అనంతరం ప్రమాదానికి గల అసలు కారణాన్ని వెల్లడించనున్నట్లు అధికారులు తెలిపారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బంగారం ధరలు స్థిరం..

**హైదరాబాద్, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**



దేశీయంగా బంగారం ధరలు శుక్రవారం స్థిరంగా కొనసాగుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ సమాచారం ప్రకారం ఉదయం 6 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,41,320గా నమోదైంది.

అదే సమయంలో 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,29,540గా ఉంది. 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,05,990 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా ఇదే స్థాయిలో ధరలు నమోదవుతున్నాయి.

ఇక వెండి ధరలు మాత్రం స్వల్పంగా తగ్గుదల నమోదు చేశాయి. కిలో వెండి ధర రూ.100 తగ్గి ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో రూ.2,34,900గా కొనసాగుతోంది.

మార్కెట్ నిపుణుల ప్రకారం, అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ మారకపు విలువ, గ్లోబల్ డిమాండ్ మార్పుల ఆధారంగా బంగారం ధరలు స్వల్పంగా స్థిరత్వం చూపిస్తున్నాయని చెబుతున్నారు. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ పరిణామాలపై ఆధారపడి ధరల్లో మార్పులు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.




# ఐఫోన్ 18 ధరలపై వినియోగదారులకు ఊరట..

**హైదరాబాద్, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి ఏడాది కొత్త ఐఫోన్ విడుదలకు ముందు ధరల పెంపుపై జరుగుతున్న ఊహాగానాలు ఈసారి కూడా టెక్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారాయి. అయితే తాజా అంతర్జాతీయ నివేదికలు యాపిల్ అభిమానులకు కొంత ఊరటనిచ్చే సమాచారం వెల్లడిస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా మెమరీ చిప్‌లు, స్టోరేజ్ భాగాల తయారీ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో ఐఫోన్ ధరలు భారీగా పెరగవచ్చని గతంలో అంచనాలు వెలువడ్డాయి. ముఖ్యంగా ఐఫోన్ 18 ప్రో ధర ఐఫోన్ 17 ప్రోతో పోలిస్తే సుమారు 200 డాలర్లు (సుమారు రూ.16,500) వరకు పెరగవచ్చని టెక్ వర్గాలు పేర్కొన్నాయి.

అయితే ప్రముఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ జేపీ మోర్గాన్ తాజా విశ్లేషణ ప్రకారం ఈ పెంపు కేవలం 50 డాలర్లు (సుమారు రూ.4,100) మేర మాత్రమే ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇది వినియోగదారులకు పెద్ద ఉపశమనంగా భావిస్తున్నారు. తయారీ ఖర్చులను తగ్గించేందుకు యాపిల్ కీలక నిర్ణయం తీసుకోనుందని సమాచారం. ప్రస్తుతం ఉపయోగిస్తున్న క్వాల్‌కామ్ మోడెమ్‌ల స్థానంలో స్వంతంగా అభివృద్ధి చేసిన 'యాపిల్ Cసిరీస్' మోడెమ్‌లను ఐఫోన్ 18 సిరీస్‌లో ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీని ద్వారా ఉత్పత్తి ఖర్చులు కొంతవరకు తగ్గవచ్చని అంచనా.

భారత మార్కెట్‌లో ప్రభావం విషయానికి వస్తే, గత ఐఫోన్ 17 ప్రో సుమారు రూ.1.34 లక్షల ప్రారంభ ధరతో విడుదలైంది. అదే స్థాయిలో స్వల్ప ధర పెంపు మాత్రమే జరిగితే, భారత వినియోగదారులపై పెద్ద భారం పడే అవకాశం ఉండదని నిపుణులు చెబుతున్నారు.

# డాలర్ ఆధిపత్యానికి సవాల్.. చమురు చెల్లింపుల్లో ఇరాన్ కీలక సంకేతాలు

**హైదరాబాద్, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** అమెరికా ఆంక్షల సడలింపు, ఇరాన్ ఆస్తుల విడుదల, చమురు ఎగుమతుల పునరుద్ధరణపై చర్చలు కొనసాగుతున్న వేళ ఇరాన్ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ అబ్దుల్నాసర్ హెమ్మతి చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో చర్చనీయాంశంగా మారాయి.

డాలర్ ఆధారిత చమురు లావాదేవీలకు ఇకపై పూర్తిగా కట్టుబడి ఉండబోమని, తమకు అనుకూలమైన ఏ కరెన్సీలోనైనా చెల్లింపులను స్వీకరించే స్వేచ్ఛ ఇరాన్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు. వాణిజ్య ఒప్పందాలు, ఆర్థిక ప్రయోజనాల ఆధారంగా ప్రత్యామ్నాయ కరెన్సీలను ఉపయోగించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వ్యాఖ్యానించారు. సుమారు 12 బిలియన్ డాలర్ల విలువైన ఇరాన్ ఆస్తుల విడుదల, ఆంక్షల సడలింపు అంశాలపై అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరుగుతున్న సమయంలో ఈ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఇదే నేపథ్యంలో భారతదేశానికి కూడా ఈ పరిణామం ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. గతంలో తక్కువ రవాణా దూరం కారణంగా ఇరాన్ చమురు భారత్‌కు ఖర్చు పరంగా అనుకూలంగా ఉండేది. అలాగే ఇతర సరఫరాదారులతో పోలిస్తే 60 నుంచి 90 రోజుల వరకు ఎక్కువ క్రెడిట్ సౌకర్యం ఇరాన్ అందించేదని గుర్తు చేస్తున్నారు.

ప్రస్తుతం ప్రపంచ చమురు మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితి మధ్య ఈ తాజా సంకేతాలు డాలర్ ఆధిపత్యంపై మరోసారి చర్చను ప్రారంభించాయి.




# భూకంప బీభత్సం.. క్షణాల్లో కూలిన భవనం

- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీసిన ప్రజలు
- వైరల్‌గా మారిన భవనం కూలిన దృశ్యాలు
- శిథిలాల కింద చిక్కుకున్న వందల మందిపై ఆందోళన

**కరాకస్, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**



వెనిజులా రాజధాని కరాకస్‌లో సంభవించిన భారీ భూకంపం తీవ్ర విధ్వంసాన్ని సృష్టించింది. భవనాలు, నివాస ప్రాంతాలు భారీగా దెబ్బతినగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. భూకంప తీవ్రతతో అనేక భవనాలు కూలిపోవడంతో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ విపత్తుకు సంబంధించిన ఒక వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. వైరల్ అవుతున్న వీడియోలో ఒక బహుళ అంతస్తుల భవనానికి ఒక్కసారిగా పెద్దపెద్ద పగుళ్లు ఏర్పడినట్లు కనిపిస్తోంది. ప్రమాదాన్ని గుర్తించిన భవనంలోని ప్రజలు భయంతో బయటకు పరుగులు తీశారు. వారు బయటకు వచ్చిన కొద్ది క్షణాల్లోనే ఆ భవనం ఒక్కసారిగా కుప్పకూలిపోవడం వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. క్షణాల వ్యవధిలో ప్రాణాలు దక్కించుకున్న వారి అదృష్టంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

భవనం కూలిన సమయంలో దుమ్ము దట్టంగా వ్యాపించడంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. భూకంపం కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా, సమాచార వ్యవస్థలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, దెబ్బతిన్న భవనాల్లోకి వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా, కూలిన భవనాల శిథిలాల కింద ఇంకా వందలాది మంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రత్యేక రక్షణ బృందాలు భారీ యంత్రాలతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. శిథిలాల నుంచి బాధితులను సురక్షితంగా బయటకు తీసేందుకు నిరంతరాయంగా శ్రమిస్తున్నాయి.

భూకంప ప్రభావంతో కరాకస్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో భారీ ఆస్తి నష్టం సంభవించింది. తాత్కాలిక శిబిరాలను ఏర్పాటు చేసి నిరాశ్రయులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందిస్తున్నారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ విపత్తు నేపథ్యంలో అంతర్జాతీయ సమాజం వెనిజులాకు మద్దతుగా నిలుస్తోంది. పలు దేశాలు సహాయక బృందాలు, వైద్య సామగ్రి, అత్యవసర నిత్యావసర వస్తువులను పంపిస్తున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి.

# వెనెజువెలాకు భారత మానవతా చేయూత

- 'ఆపరేషన్ అమిస్తాద్'తో అత్యవసర సహాయక చర్యలు
- వైద్య బృందం, భీష్మ క్యూబ్‌లు, మందుల తరలింపు
- భూకంప బాధితులకు అండగా నిలిచిన భారత్




**న్యూఢిల్లీ, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** వరుస భూకంపాలతో తీవ్రంగా నష్టపోయిన వెనెజువెలాకు భారత్ అత్యవసర సహాయాన్ని అందించేందుకు 'ఆపరేషన్ అమిస్తాద్' పేరుతో ప్రత్యేక సహాయక చర్యలను ప్రారంభించింది. స్పానిష్ భాషలో 'అమిస్తాద్' అంటే స్నేహం అని అర్థం. భారత వైమానిక దళానికి చెందిన రెండు సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానాల ద్వారా వైద్య బృందం, అత్యవసర వైద్య సామగ్రి, భీష్మ క్యూబ్‌లు, ఇతర సహాయక పరికరాలను వెనెజువెలాకు పంపించింది. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ వెల్లడించింది. వెనెజువెలా ప్రజలు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ఈ సమయంలో భారత్ వారికి పూర్తి మద్దతుగా నిలుస్తుందని తెలిపింది. సహాయక బృందంలో 60 పారా ఫీల్డ్ హాస్పిటల్‌కు చెందిన 41 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో తొమ్మిది మంది వైద్యులు ఉండగా, అత్యవసర వైద్యం, శస్త్రచికిత్సలు, ఇతర ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రత్యేకంగా సిద్ధమయ్యారు.

సహాయక బృందంతో పాటు సుమారు ఆరు టన్నుల వైద్య సామగ్రిని కూడా పంపించారు. ఇందులో అత్యవసర మందులు, చికిత్స పరికరాలు, ప్రాణరక్షక ఔషధాలు, వైద్య వినియోగ సామగ్రి ఉన్నాయి. విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ వైద్య సేవలు అందించడమే ఈ సహాయ చర్యల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

ఆరోగ్య మైత్రి కార్యక్రమంలో భాగంగా రూపొందించిన రెండు భీష్మ క్యూబ్‌లను కూడా భారత్ వెనెజువెలాకు పంపించింది. విపత్తుల సమయంలో అత్యంత వేగంగా ఏర్పాటు చేయగలిగే ఈ ఆధునిక వైద్య యూనిట్లు తాత్కాలిక ఆసుపత్రులుగా పనిచేస్తాయి. శస్త్రచికిత్సలు, అత్యవసర చికిత్సలు, ప్రాథమిక వైద్య సేవలు ఒకేచోట అందించే సామర్థ్యం వీటికి ఉంది. వెనెజువెలాలో బుధవారం స్వల్ప వ్యవధిలో రెండు భారీ భూకంపాలు సంభవించాయి. ఈ ప్రకృతి విపత్తులో ఇప్పటివరకు 235 మంది మృతి చెందగా, 1,500 మందికిపైగా గాయపడినట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. వేలాది మంది ఇంకా గల్లంతైనట్లు సమాచారం. రాజధాని కరాకస్‌తో పాటు లాగువైరా ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతినడంతో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ విపత్తు నేపథ్యంలో భారత్‌తో పాటు అమెరికా, బ్రెజిల్, మెక్సికో, అర్జెంటీనా తదితర దేశాలు కూడా సహాయాన్ని ప్రకటించాయి. అంతర్జాతీయ స్థాయిలో మానవతా సహాయ కార్యక్రమాలు కొనసాగుతుండగా, బాధితులను ఆదుకునేందుకు వివిధ దేశాలు వైద్య బృందాలు, సహాయక సామగ్రిని పంపిస్తున్నాయి. క్లిష్ట పరిస్థితుల్లో వెనెజువెలా ప్రజలకు అండగా నిలవడం ద్వారా భారత్ మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకుంది.

# డేటింగ్ యాప్ ఉచ్చులో డెలివరీ బాయ్

- పరిచయం పేరుతో కిడ్నాప్.. రూ.90 వేల దోపిడీ
- సీసీటీవీ ఆధారంగా ఐదుగురు నిందితుల అరెస్ట్
- ఆన్‌లైన్ పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక






**నాగ్‌పూర్, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఆన్‌లైన్ డేటింగ్ యాప్ ద్వారా ఏర్పడిన పరిచయం ఓ యువకుడికి భయానక అనుభవాన్ని మిగిల్చింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న ఓ యువకుడిని డేటింగ్ యాప్‌లో పరిచయం పెంచుకున్న వ్యక్తి పక్కా ప్రణాళికతో ముఠా వలలోకి దింపాడు. అనంతరం అతడిని కిడ్నాప్ చేసి బెదిరించి రూ.90 వేల నగదును దోచుకున్న ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం బాధితుడు ఖాళీ సమయంలో డేటింగ్ యాప్‌ను వినియోగించేవాడు. ఈ క్రమంలో నిందితుల ముఠాలోని ఒక వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కొద్దిరోజుల పాటు ఇద్దరూ సందేశాల ద్వారా మాట్లాడుకోవడంతో పరస్పర నమ్మకం ఏర్పడినట్లు భావించారు. అనంతరం ప్రత్యక్షంగా కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే ఈ పరిచయం వెనుక కిడ్నాప్, దోపిడీకి సంబంధించిన పథకం దాగి ఉందని బాధితుడు గ్రహించలేకపోయాడు.

ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి పని ముగించుకుని స్కూటీపై ఇంటికి వెళ్తున్న బాధితుడిని నాగ్‌పూర్‌లోని మాంకాపూర్ చౌక్ వద్ద ఓ వ్యక్తి లిఫ్ట్ అడిగాడు. అనుమానం రాక అతడిని స్కూటీపై ఎక్కించుకున్నాడు. కొంతదూరం వెళ్లగానే మరో నలుగురు వ్యక్తులు స్కూటీని అడ్డగించి, ఐదుగురూ కలిసి యువకుడిపై దాడి చేసి బలవంతంగా కారులో ఎక్కించి కిడ్నాప్ చేశారు. తర్వాత అతడిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన నిందితులు తీవ్రంగా బెదిరించి స్కూటీ తాళాలు, మొబైల్ ఫోన్, ఏటీఎం కార్డును లాక్కొన్నారు. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించడంతో భయపడిన బాధితుడు తన స్నేహితులు, పరిచయస్తులకు ఫోన్ చేసి తన ఖాతాలో డబ్బులు జమ చేయించాలని కోరాడు. వారి ద్వారా వచ్చిన మొత్తం రూ.90 వేలను నిందితులు ఏటీఎం కార్డు ఉపయోగించి వివిధ కేంద్రాల నుంచి విత్‌డ్రా చేసి అనంతరం బాధితుడిని వదిలేసి పరారయ్యారు.

బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో కేసును సీరియస్‌గా తీసుకున్న అధికారులు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఘటన జరిగిన ప్రాంతంతో పాటు నిందితులు ప్రయాణించిన మార్గాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించి వారి కదలికలను గుర్తించారు. ఆ ఆధారాలతో ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. గతంలో కూడా ఇదే తరహాలో డేటింగ్ యాప్‌ల ద్వారా అమాయకులను లక్ష్యంగా చేసుకున్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటన నేపథ్యంలో ఆన్‌లైన్ డేటింగ్ యాప్‌లు, సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన వ్యక్తులను గుడ్డిగా నమ్మవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. ప్రత్యక్షంగా కలుసుకునే ముందు వారి వివరాలను నిర్ధారించుకోవడం, నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవడం, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హెచ్చరించారు.

# క్విక్ కామర్స్ రంగం కొత్త దశలోకి.. వేగం నుంచి లాభదాయకత వైపు మార్పు

**హైదరాబాద్, జూన్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**




భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న క్విక్ కామర్స్ రంగం ఇప్పుడు కొత్త దశలోకి అడుగుపెడుతోంది. ఇప్పటివరకు 10-15 నిమిషాల్లో డెలివరీ అందించడం ప్రధాన లక్ష్యంగా ఉన్న ఈ రంగం, ఇప్పుడు లాభదాయకత, యూనిట్ ఎకనామిక్స్, ఆపరేషనల్ సామర్థ్యం వైపు దృష్టి సారిస్తోంది.

ప్రస్తుతం ఈ మార్కెట్‌లో ఎటర్నల్ (మాజీ జొమాటో)కు చెందిన బ్లింకిట్ సుమారు 45-50 శాతం వాటాతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా 200కు పైగా నగరాల్లో 2,243 డార్క్ స్టోర్ల నెట్‌వర్క్‌తో ఇది బలమైన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సంస్థలు చెరో 20-25 శాతం మార్కెట్ వాటాతో పోటీని కొనసాగిస్తున్నాయి.

స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ నాటికి 1,143 డార్క్ స్టోర్లను, జెప్టో 1,139 డార్క్ స్టోర్లను నిర్వహిస్తున్నాయి. దీంతో ఈ రంగంలో పోటీ మరింత తీవ్రమవుతోంది.

ఇదే సమయంలో ఫ్లిప్‌కార్ట్ తన "ఫ్లిప్‌కార్ట్ మినిట్స్" సేవను వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే 1,000 మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయగా, 180 నగరాల్లో 1,500 డార్క్ స్టోర్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు అమెజాన్ కూడా "అమెజాన్ నౌ" సేవను 300 నగరాలకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అమెజాన్ ఇప్పటికే భారత మార్కెట్‌లో ప్రకటించిన 48 బిలియన్ డాలర్ల పెట్టుబడిలో భాగంగా ఈ క్విక్ కామర్స్ విభాగాన్ని కీలకంగా తీసుకుంటోంది. దీంతో దేశంలో ఈ రంగంలో పోటీ మరింత వేడెక్కుతోంది.

విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఇప్పుడు కంపెనీల ప్రధాన లక్ష్యం కేవలం వేగంగా డెలివరీ చేయడం మాత్రమే కాకుండా, వినియోగదారులను నిలుపుకోవడం, లాభాలు సాధించడం, సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించడం. అందుకే కంపెనీలు నిత్యావసరాలతో పాటు ఎలక్ట్రానిక్స్, బ్యూటీ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తుల వరకు తమ సేవలను విస్తరిస్తున్నాయి.

మొత్తంగా చూస్తే, భారత క్విక్ కామర్స్ రంగం వేగం ఆధారిత పోటీ నుంచి స్థిరమైన వ్యాపార నమూనాల వైపు మారుతోంది. ఇది వినియోగదారులకు మరింత సౌకర్యాన్ని అందించనున్నప్పటికీ, కంపెనీలకు మాత్రం పెద్ద సవాలుగా మారనుంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in